
2005 క్రేన్ కథలపోటీలో సాధారణ ప్రచురణకు
స్వీకరించిన కథ

# ఆశల సంచి

ఐతా చంద్రయ్య




"గుర్ర్....ర్....ర్ర్...గుర్ర్... ర్ర్...." నాగరాజు గురక పందికొక్కు అరుపు లాగుంది.

"బావా.... బావా! ... అప్పుడే తెల్లారిపోయింది".

అన్నపూర్ణ ఆబగా పిలిచింది. అర్ధాంగి పిలుపు అతని గురకకే మాత్రం ఆటంకం కాలేదు. మంచమీద అటుతిరిగి పడుకున్నాడు. నులక మంచం కిర్రుమంది. అయినా లేవలేదు.

దోరవయసులో దోర నిమ్మ పండులాగున్న అన్నపూర్ణకు చిరాకేసింది. భుజాలు పట్టి కుదిపింది. ఇటు తిరిగాడు. గురక రాగం ఊపందుకుంది. చిరాకు, పరాకులనదిమిపెట్టింది. ఈయన నిద్ర ఎట్లా పోవాలబ్బా... ఆలోచిస్తోంది.

అది నాల్గోరోజు. జాతరలో తప్పిపోయిన పిల్లాడిలా ఆకాశం అంగట్లోంచి సూర్యుడు మాయమై మూడ్రోజులు దాటింది. కాని... ఆరోజు కనబడేట్టుంది. చూపులు కిటికీలోంచి బయటికెళ్ళినై. తూరుపు ఆకాశం... కల్లాపి చల్లిన వాకిలిలా కాంతుల్ని సంతరించుకుంటోంది. నునులేత సూర్యకిరణాలు తమ గుడిసె తాటాకులకు బంగారు పూతలు పూస్తున్నాయి. అటే చూస్తూ తనలో తాను నవ్వుకుంది. ఇహ... ఈరోజు పనిలోకెళ్లొచ్చు.

అలనాటి దివిసీమను ఛిన్నాభిన్నం చేసిన తుఫాను వీరంగాన్ని దృష్టిలో ఉంచుకుని ఆ ఎత్తు ప్రదేశాన్ని ప్లాట్లుగా చేసి బలహీనవర్గాలకు పంచేసింది ప్రభుత్వం.

కట్నం కోసం ఓ కర్రెకాకి మెడలో మూడు ముళ్ళెయ్యాలన్న తల్లిదండ్రుల నెదిరించిన నూకరాజు తనంటే పడి చచ్చే మేనమరదలు అన్నపూర్ణను గుళ్ళో పెళ్ళి చేసుకున్నాడు. కన్నవారి ఆగ్రహాన్ని నిగ్రహంతో ఎదిరించి కట్టుబట్టల్తో బయటికొచ్చేశాడు. అప్పుడే అతని పేర మంజూరైన ప్లాటు ఆసరా అయింది.

ధైర్యం, పట్టుదల నడలిపోకుండా మనిషికి అసాధ్యమనేది లేదని నిరూపించుకోవాలనుకున్న కొత్త జంట అదే స్థలంలో పక్కాగుడిశె వేసుకుంది. దినమంతా కూలిపని, రాత్రంతా రాసలీలగా గడుస్తున్నాయి రోజులు. గుడిసె సామాగ్రి కోసం చేసిన అప్పులు చెల్లిపోయినై. ఇంటి చుట్టూ చెట్లు ఎదిగి రక్షక భటుల్లా నిల్చుండిపోయినై. గాలి అలల్ని, వెన్నెల వెలుగుల్ని, రేడియో పాటల్ని హాయిగా అనుభవిస్తూ గడిపేస్తున్న జంటకు కొత్త అనుభవం ఎదురైంది.

నాల్గురోజుల క్రితం సూర్యుణ్ని బందీ చేసిన నల్లని మబ్బులు ఆకాశంలో వెలుగు రేఖలను పరుచుకోనివ్వలేదు. రోజుట్లాగే వంట పూర్తియింది. మధ్యాహ్న భోజనం టిఫిన్ డబ్బాల్లో కెళ్ళిపోయింది. కూలిపని కెళ్ళాలని తయారవుతున్నారు. రేడియోలో తుఫాను హెచ్చరిక వెలువడింది. 'బంగాళా ఖాతములో అల్పపీడనం, తీర

ప్రాంతాల్లో జోరుగాలులు, వర్షాలు...' మామూలుగానే వినబడింది. కొద్ది సేపట్లోనే ఆకాశం కాటుక కొండలా కనబడింది.

గోధుమ రొట్టె మీదికి గొంగూర పచ్చడి నంజుకుంటూ "అదిగో బావా! అటు చూడు" అంటూ కాటుకకళ్లతో గుమ్మంబయటికి చూపించింది. రొట్టెముక్క పళ్లకిందున్న నూకరాజు నమలడం ఆగిపోయింది. మొహం ముడుచుకుపోయింది. చూపులలాగే నిలబడిపోయినై.

★ ★ ★

"అయ్యో బావా!వాన వచ్చేత్తుందేమో!" అన్నపూర్ణ ఆందోళన... గుండెల్లో గుబగుబలు.

నూకరాజు ఆకాశాన్నే చూస్తున్నాడు. నల్లమబ్బుల పటాటోపం చూస్తూ తెల్లబోయాడు. పెళ్లాం ముందు కంగారు పడితే "ఇంతేనా ఈయన ప్రతాపం" అనుకుంటుందేమో! చిటపట చినుకులు చిందర వందరగా పడుతున్నై. "ఏమో... ఏమీ కాదులేవే!" బింకం.

"అయ్య బాబోయ్. చినుకులు... అమ్మో! అవి చినుకులా ఆకాశమ్మించి రాల్తున్న గచ్చకాయలా?" నోరెల్లబెట్టింది.

చినుకులు టపటపమంటూ వేగం పుంజుకుంటున్నాయి.

"అవి మననేం జేత్తాయిలేవే! ఏదో కాసేపు ఉరుములు, మెరుపులు. మన తీరప్రాంతమోల్లకివి మామూలే గదా!" మనసు పీచుపీచుమంటున్నా పైకి కొట్టి పారేశాడు.

గబగబా రొట్టె తినేసింది.

"అమ్మో! తుఫానేమో బావా!" గుండెలు బాదుకుంది.

"రేడియో వార్తలు విన్నాంగదా... ఏదో కాబోతుంది".

"ఛఛా...!" ప్లేట్లో చెయ్యి కడుక్కుంటూ "తుఫాను వత్తే..దానికోరలుపీకేద్దాం.." అనేశాడు.

అన్నపూర్ణకా మాటలేవీ నచ్చలేదు. మూతి తిప్పింది.

"ఓయబ్బో! కోతలు కొయ్యకు బావా. నూకరాజుగారు నూకలు కొనాలంటే డబ్బులు కావాల. డబ్బులు రావాలంటే కూలిపని చెయ్యాల. కూలిపని కెళ్లాలంటే వాన రావొద్దు గందా!" తడి చేతిని కొంగుకు తుడుచుకుంది.

బయట ఉరుములు, మెరుపులు తగ్గలేదు. కళ్లు మిరిమిట్లు గొలిపే మెరుపుల్లా అన్నపూర్ణ ముక్కుపుడక చెమక్కుమంది. గుండెపొరల్లో అనుమానం తళుక్కుమంది. అయినా అన్నపూర్ణ బయటికొచ్చి నుంచుంది. నూకరాజు గుడిశెకు తాళం వేయబోతున్నాడు.

సందట్లో సడేమియా అన్నట్టు గాలి తోడైంది. వర్షం ఊపందుకుంది. చినుకులు ఊడిపడుతున్న చిలుక్కొయ్యల్లాగున్నాయి. ఒక్క నిమిషంలో ఇద్దరూతడిసిపోయారు. "వామ్మో!వాన కాదిది. తుఫాను గాలులే పూర్ణా! లోపలికి రా!" అరుస్తూ లోపలికి పరుగెత్తాడు. లేడిపిల్లలా గంతులేస్తూ అన్నపూర్ణ గూడా లోపలికొచ్చేసింది. దిగులుగా ఆకాశం వంక చూశారు.

ఆకాశం మాయమైంది. పాపం సూర్యుడు, ఎక్కడ దాక్కున్నాడో! వర్షం కుండపోతగా మారింది. గాలి జోరందుకుంది. సముద్రం హోరెత్తుతోంది. నీటి ప్రవాహం పెరుగుతోంది.

"మా నానమ్మ అంటుండేది - సముద్రం పక్క నుంటే పాము పడగ కింద ఉన్నట్టేనని" గొణుక్కుంది అన్నపూర్ణ. పైకి మాత్రం "ఇలాగైపోయిందేటీ... ఈరోజు కూలి పని ఇంతే సంగతులా?" చీర మార్చుకుంటూ చిన్నబోయింది. మహాప్రయత్నమ్మీద మైకు దొరికించుకున్న గల్లీ లీడర్ ఉపన్యాసంలా వాన-గాలి ఏ మాత్రం తగ్గలేదు.

"మన గుడిశెకు ఇనుపదూలాలు, రేకులు వేసి ఆపైన తాటాకులు కప్పాం కాబట్టి నిలదొక్కుకుంది. లేపోతే ఈపాటికి పైకప్పు ఎగిరిపోయేది. ఇలాంటి వాన నేనెప్పుడూ చూల్లేదు" అంటూ మంచమ్మీద పెళ్లాం పక్కన కూచున్నాడు. మంచం కిందున్న బుల్లిరేడియో చేతిలోకొచ్చి గొంతు విప్పింది. తీరవాసులకు ప్రత్యేక బులిటెన్..." కోస్తా తీరంలో తుఫాను ఉధృతమైంది. లోతట్టు ప్రాంతాలవారు, సముద్రానికి దగ్గర్లో వున్నవారు సురక్షిత ప్రాంతాలకు తరలిపోవా"లని అధికారుల హెచ్చరిక.

అన్నపూర్ణ ఆందోళన తుఫానుగా మారింది. కిటికీలోంచి ఊరంతా కనబడుతోంది. చెట్లు మొదటికి నరికినట్టు పడిపోతున్నాయి. సముద్రం యుద్ధభేరిని కర్ణభేరి భరించలేకపోతోంది. సాయంత్రమయిందేమో- చీకటి పరదాలు చిక్కబడుతున్నాయి. పశువుల అరుపులు, మనుషుల హాహాకారాలు గుండెల్ని పిండేస్తున్నాయి.

కంటి మీద కునుకు కరువైంది. తెల్లవారిందని రేడియో ద్వారా తెలిసింది.

"... సముద్రతీర ప్రాంతం ఉప్పెనకు గురైంది. ఈదురు గాలులు ఉధృత మైనాయి. నిన్నటి నుండి ఎడతెరిపి లేని కుండపోత వర్షం కారణంగా ఎన్నో గ్రామాలు జలమయమైనాయి. ఆస్తినష్టం, ప్రాణనష్టం అంచనా కందడంలేదు".

రేడియో వార్తల సారాంశం.



హైదరాబాదు కళాసుబ్బారావు కళా వేదికలో జనవరి 20న మానస ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో జరిగిన బహుభాషా కవిసమ్మేళనంలో పాల్గొన్న అతిధులు, కవులు. చిత్రంలో కె. కామేశ్వరరావు, రఘుశ్రీ, వెంకటేశ్వర హండే, మొహియుద్దీన్, దేవేందర్, కె. శివారెడ్డి, ప్రభామకేమర్, సురేందర్‌లు ఉన్నారు.

"సముద్రపు అలలు, సమయం మనిషి కోసం ఆగవన్న ఆంగ్ల సామెతను అక్షరాలా నిజం చేస్తూ మళ్లీ సాయంత్రమైంది. . పోలీస్ స్టేషన్‌లో పల్లెటూరు ఖైదీల్లా భార్యాభర్తలు నులక మంచమ్మీద మొహాలు చూసుకుంటూ ముడుచుక్కూచున్నారు. పంచప్రాణాలు అర చేతుల్లో వున్నాయనిపిస్తోంది.

కళ్లతో సైగలు చేసుకున్నారు. భుజాలమీద చేతులేసుకుని మెల్లిగా లేచొచ్చి కిటికీ తలుపులు తెరిచారు.బయటిదృశ్యం భయానకంగా ఉంది. మృత్యుదేవత వికటాట్ట హాసం లాగుంది. వరద జోరు, జనాలు కొట్టుకు పోతున్నట్టుంది. అన్నపూర్ణ అంతరాళాల్లో సుడులు తిరిగిన దుఃఖం ఉప్పెనలా పొంగు కొస్తోంది.

"మన ఊరంతా కొట్టుకుపోతుంది బావా! గుండెలు బాదుకుంటూ బోరమంది. ఊరు కనబడ్డంలేదు.

"అవునే పూర్ణా! మనూరు.....ఏదీ? మనుషులు, పసులు, దొడ్లు, ఇండ్లు... ఏవీ. అన్నీ నీళ్లే". నూకరాజు గొంతులో బాధ. ప్రాణం తల్లడిల్లింది. "మనం ఎత్తు మీదున్నాం కాబట్టి బతికి పోయినమే. "దుఃఖమాగట్లేదు. పొంగులు పొంగులుగా ఉబికొస్తోంది.

ఒకరి కౌగిట్లో ఒకరు ఒదిగి పోయారు. ఆ ఏడుపు రాగాలను సముద్రం హోరు మింగేస్తోంది. పక్కింటి పుల్లయ్యనూ, అతని భార్యనూ గొంతెత్తి పిలిచారు... కోరస్‌గా పిలి చారు. ఆ పిలుపు గాలిహోరులో కొట్టుకు పోయింది. లాభం లేదు. బయటి ప్రపంచంతో సంబంధాల్లేవు. నూకలగంజితో ఆరోజు గడిచింది.

మూడో రోజు-రేడియో వార్తలు ఊపిరి పోస్తున్నాయి. వర్షం తగ్గి ముసురుగా అవత రించింది. వీధుల్లో నీటిమట్టం తగ్గిపోయింది. ప్రళయకాలమంటే ఏమిటో పురాణపండితులు చెబితే విన్నారు. కాని ఇప్పుడది ప్రత్యక్షంగా కనబడుతోంది. ఇళ్ళకప్పులమీద, డాబాల మీద చేతులు పైకెత్తి జనాలు అంగలారుస్తున్నారు. కొందరు నీటిలో, ముసురులో తడుస్తూ తమ ప్రాంతంవైపు వస్తున్నారు. లేస్తూ-పడుతూ, లబలబలాడ్తూ ఒకరిని పట్టుక ఒకరు పరుగెత్తు కొస్తున్నారు. వెనకనుండి యమభటులు తరుముతున్నట్టు- ఊడిపోతున్న గుడ్డల్ని సైతం లెక్కచేయకుండా ఉరికొస్తున్నారు. కొంపా గోడూ పోగొట్టుకుని లబలబలాడ్తున్నారు.

ఆకాశంలో అదేదో శబ్దం... మరణ మృదంగం వాయిద్యంలాగుంది. అంతలోనే హెలీకాప్టర్ ప్రత్యక్షమైంది. చుట్టుపక్క గుడిసె వాసులంతా రెక్కాడితేగాని డొక్కాడని సామాన్యులే. దబదబా తలుపులు తెరుచుకుని పుట్టల్లోని చీమల్లా బయటికొస్తున్నారు. హెలీకాప్టర్ నుండి ఏవో రాలిపడ్తున్నాయి. అవి పులిహోర పొట్లాలే అయుంటాయి. ఆకలికేకలు హెలీకాప్టర్ నంటుతున్నాయి.

నూకరాజు దంపతులు ధైర్యంగా బయటి కొచ్చారు. జన సముద్రంలో కలిసి పోయారు. పిడికిట్లో బిగపట్టుకున్న ఊపిరికి పులిహోర పొట్లాలతో ఊరట లభించింది. కడుపు నిండగానే కంటికి నిద్ర గుర్తుకొచ్చింది.

రాత్రంతా ఏం జరిగిందో ఏమీ తెలీదు.

అది నాల్గోరోజు. ప్రకృతి ఆవులించింది. అప్పుడే తెల్లవారుతోంది. అమాంతం మెలకువొచ్చిన అన్నపూర్ణకో విషయం గుర్తుకొచ్చింది. దివిసీమ ఉప్పెన సమయంలో కొందరు ముందు జాగ్రత్త వహించి, నలుగురి కళ్లల్లో పడకుండా ఎలా లాభపడ్డారో... నానమ్మ ఓ సారి చెప్పిన సంగతి బుర్రలో గిర్రుమంది. అంతే నూకరాజు నెలాగైనా నిద్రలేపి కర్తవ్యోన్ముఖుణ్ణి చేయాలని తంటాలు పడుతోంది... మేలుకొలుపు ఫలితాన్నివ్వలేదు. నూకరాజు భుజాలు పట్టి కుదిపిన ప్రయత్నం బూడిదలో పోసిన పన్నీరైంది.

"ఛీఛీ... మొద్దు నిద్ర... యెదవ నిద్ర.." గొణుక్కుంటూ ప్లాస్టిక్ మగ్గు నిండా నీళ్లు తెచ్చి మొహానికి కొట్టింది. నూకరాజు నిద్రను ఛేదించే బ్రహ్మాస్త్రమైంది.

"వామ్మో ఉప్పెన... నీళ్లు...పూర్ణా లే..." నిలువెల్లా వణికిపోతూ ఉప్పెన ... నీళ్లు..పూర్ణా లే..." నిలువెల్లా వణికిపోతూ లేచి కూచున్నాడు. మంచం కీచుమంది. అన్నపూర్ణ కిసుక్కున నవ్వింది. "ఉప్పెన మనింటిదాకా రాలేదు గానీ తొరగా లే బావా!" నవ్వాపు కుంటూ కొంగు బొడ్లో దోపుకుంది. చేతులు నడుమ్మీద, చూపులు నూకరాజు వాలకమ్మీదున్నాయి.

దుప్పటితో ముఖం తుడుచుకుంటూ చురచురా చూశాడు. " ఎందుకూ...?" కోపం తోసుకొచ్చింది. పడుచు పెళ్లాం నవ్వు కోపాన్నంతా కొట్టిపారేసింది. లేచి నుంచున్నాడు. గాలికి ఊగిసలాడ్తున్న చెట్టులాగున్నాడు. "ఎందుకు పూర్ణా? ఈరోజు పనిలోకెల్దామా?" బుగ్గలందుకోబోయాడు. మూడేళ్ల పాపలా ముద్దులొలికిస్తూ" అవును. నువ్వు పనిలో కెళ్లాల" అంటూ తానే ముందుకొచ్చి భుజాలందుకుంది. నూకరాజు నిద్రమత్తు చిత్తైపోయి హుషారెక్కింది.

"చూడు బావా!" పెదాలతో పెదాలు ఒరుసుకుంటున్నాయి. చెవిలో గుసగుస చెప్పింది. నూకరాజు గుండెల్లో బాంబు పేలినట్టైంది. "వామ్మో!" నోరెల్లబెట్టాడు. కళ్లల్లో భయాశ్చర్యాలు. అన్నపూర్ణ ఏమాత్రం వెనక్కు తగ్గలేదు. చారడేసి కళ్ళను చలాకీగా తిప్పుతూ.

"అవును మరి అందరికంటే ముందు


స్వగృహ ఫుడ్స్

Swagruha® Foods

Opp : P.W.D. Grounds, M.G. Road, VIJAYAWADA - 10
Phone : 2475763, Fax : 0866 - 2480200.
Eluru Road (Canara Bank Building).
Near Vijaya Talkies, Vijayawada - 520 002. Ph : 6626263.
10/2, Arundelpet, Guntur - 522 002. Ph : 2235350.
Visit us : www.swagruhafoods.net

మహాశివరాత్రి శుభాకాంక్షలు

జాగర్త పడాల. ఆనక పోతే పోలీసోళ్లు దిగుతారు. ఆ పని వాళ్లే చూస్కుంటరు. ఒక్క పూట ధైర్యంజేస్తే జీవితాంతం సుఖపడొచ్చు" కితకితలుపెట్టింది. నానమ్మ చెప్పినదంతా విడమరచి చెప్పింది. నూకరాజుకంతా అర్థమైంది. భవిష్యత్తు బంగారుబాటలా కళ్లల్లో కదలాడింది. అదృష్టం తలుపుతట్టినప్పుడే ఆహ్వానించాల. ఆశల పల్లకినెక్కి ఆశయాన్ని సాధించాల...

"నిజం పూర్ణా. ఆలస్యం అమృతం విషమన్నారు. ఓ సంచీ వెతికి పట్రా" కళ్లల్లో ఆశల వెలుగులు... ఒక్క ఊపుతో ముందుకు నడిచి కిటికీలోంచి బయటికి చూశాడు. వెలుగు రేఖలు తమ ఉనికి తెలుపుకుంటున్నాయి.

బొగ్గుపొడి బరబరా పళ్లు తోమేసింది. అన్నపూర్ణ అందించిన డికాక్షన్ సిప్ చేస్తూ ఆమె బుగ్గల అద్దాల్లో మొహం చూసుకుంటున్నాడు. ఉత్సాహం ఉబికొచ్చి ఉరకలేస్తోంది.

"బావా! తొరగా రావాల" సంచి అందిస్తూ జుట్టు సవరించింది" మజ్జాన్నమైతే గోర్మెంటోళ్లు దిగొచ్చు. బయటంతా గందరగోళంగా వుంది. జాగర్త సుమా!"

ఫుల్‌షర్టు, నిక్కరు జేబులో మడిచి పెట్టిన సంచీ... అటూ ఇటూ చూస్తూ చాటుమాటుగా బయలుదేరాడు. వాతావరణం చల్లగా, అదృష్ట దేవత కరస్పర్శలాగుంది. చూపులు నాల్గు దిక్కులా ప్రసరిస్తున్నాయి. ఎత్తు నుండి పల్లం దిశగా... ఊరివైపు ప్రయాణం.

పొద్దుపొడిచి జానెడెక్కింది. నూకరాజు ముందుకెల్తున్నాడు... ఈ పెపెంచకంలో ఎన్నో వింతలు జరుగుతున్నై. ఒకరోజు చిప్ప పట్టుకొని అడుక్కున్న వాడీ రోజు కోటీశ్వరు డైనాడు. అలనాటి లక్షాధికారి ఈనాడు భిక్షాధి కారైనాడు... మెదడు పొరల్లో ఏవేవో భావాలు కదుల్తున్నాయి... తోవ కనబడకుంటా ఇసుక పరుచుకునింది. కాలివేలికి మెత్తగా తగిలింది. శవం... ఆశలు, ఆరాటాలు ఏవీ లేని మనిషి.. మగమనిషి శవం... సగం ఇసుకలో కూరుకు పోయింది. వాననీరు గుంటల్లో నిలిచి వుంది. శవం తాలూకు కుడి చెయ్యి గుంటనాను కునుంది. రెండు చేతుల వేళ్ళకు బంగారు ఉంగరాలు. వచ్చిన పనికి ప్రారంభోత్సవం... ఒడుపుగా ఉంగరాలు సొంతమైపోయినై. విగతజీవుల మృతదేహాలు, పశు కళేబరాలు చుట్టూరా ఆరబోసినట్టున్నై. గోడలు కూలిన ఇండ్లు, వేళ్లతో సహా పడిపోయిన చెట్లు... అంతా నిశ్శబ్దంగా వుంది. దుర్వాసన, శవదుర్గంధం. ముక్కు పుటాల నదరగొడు తోంది. ఆశల సంచి నోరు తెరుచుకునే వుంది.

వెళ్లిపోయిన చుట్టం మళ్ళీ వచ్చి నట్టుగా తిరిగి మునురు... నన్నని మునురు ముసురుకుంది. ఆడ మనిషి శవం.... మెడలో ఒంటిపేట గొలుసు తళుక్కుమంది. ఉత్సాహం ఉరికొచ్చింది. గొలుసు చేతిలో పడింది. ఎవరో వెనక్కు లాగుతున్నట్టున్నా అడుగులు ముందుకు పడుతున్నాయి. సంచిలో నగలు పడుతున్నాయి.

తల్లిపక్కన పిల్లశవం, పిల్లనోట్లో స్తనం... ఆడా-మగ జంట శవాలు... దృశ్యం అదర గొడుతోంది. మొండి ధైర్యం ముందుకు నెట్టు తోంది.

కాస్సేపయాక ముసురు తోక ముడిచింది. ధైర్యం మరింత బలం పుంజు కుంది. నీటి గుంట పక్కన నల్లకుక్కపిల్ల.... స్టైల్‌గా తోకాడిస్తూ తననే చూస్తోంది.

పోవే... నువ్వేమన్నా పోలీసువా!... నవ్వుకున్నాడు. సంచి సగం నిండింది. మనసు తృప్తిగా మూల్గింది. దుర్వాసన కడుపులోని పేగుల్ని కలెబెడుతుంది. డొకొస్తుందేమో...! ఇక వెనుదిరగాలనుకున్నాడు.

.... ఈ నగలు హైద్రాబాదులో అమ్మెయ్యాలి. పాక పీకేసి బంగళా కట్టుకోవాలి. ఏదన్నా యాపారంలకు దిగాలి... ఇహ పిల్లలు పుట్టకుండా జాగ్రత్త పడాల్సిన అగత్యం లేదు... గర్వంతో ఛాతీ విశాలమైపోతోంది.

ఆకాశంలో గద్దల రెక్కల చప్పుళ్లు... అవి తన గుండె చప్పుళ్లను కనిపెడ్తున్నాయేమో! ఎండ... లేత ఎండ... వెండి రేకుల్లా నేలమీద పరుచుకొంటోంది. కాలికేదో మెత్తగా తగిలింది. పడబోయి నిలదొక్కుకున్నాడు. అది శవమే అయిుంటుంది. అవును... స్త్రీ శవం... దబ్బ పండు లాగుంది. ఒంటినిండా పట్టుబట్టలు... మెడ నిండా నగలు... కాళ్లూ చేతుల్ని ఇసుక కప్పేసింది. శవం తలకింద గుండ్రాయి.... తలగడలాగుంది. సూర్య కిరణాలు సోకి నెక్లెస్ మిలమిల్లాడుతోంది. ముందు దాన్ని తీసి సంచీలో వేశాడు. మిగతా నగలన్నీ వచ్చేసినై... చివరకు మిగిలింది వసంత హారం... నవరత్నాలు, పొదిగిన పొడగాటి వసంతహారం, హమ్మయ్య... ఇదొక్కటి తీసుకుని వెళ్లిపోవాలి. లాగి చూశాడు... వసంతహారం చేతికి రాలేదు. మరోసారి గట్టిగా లాగాడు. రాలేదు... మొండి కేసింది.

తెరలు తెరలుగా గాలివీస్తోంది. వెన్ను పూసలో సన్నని వణుకు... ధైర్యంగా. రెండు చేతుల్తో లాగాడు. అయినా రాలేదు. గుండె పొరల్లో బుగులు బయలుదేరింది. తలెత్తి కనబడినంత మేర దృష్టి వ్యాపించింది. ఎవ్వరూ లేరు. ప్రాణం బిగవట్టేశాడు. భుజాల్లో ఉత్సాహం పొంగింది. మెడ కింద ఇసుకను ముందు తొలగించాడు.

ఇదొక్కటి వచ్చేస్తే ఇంకేమీ అక్కరలేదు. ముందుకు వంగి చేతులు మెడకిందికి తోశాడు. ఉచ్ఛ్వాస నిశ్వాసలు దబ్బపండు మొహాన్ని స్పర్శిస్తున్నాయి. చేతుల కదలికకు మెడకింది గుండ్రాయి పక్కకు తొలగిపోయింది. తలచేతుల్లో వాలింది. బరువు... చాలా బరువుంది. శవం మొహం కదుల్తోంది. అమ్మో ఇదేమిటీ... గుండె ఝల్లుమంది. స్త్రీ... కొనప్రాణంతో వుందని తెలియదు.

"ఆఁ.... హా... హాయ్!" ఎప్పుడో శవమైందనుకున్న స్త్రీ నోటి నుండి చివరి శ్వాస వెలువడింది. నోరు బార్లా తెరుచుకుంది. నూకరాజు గుండె-మిద్దెమీంచి తెగి బండమీద పడ్డ గుమ్మడి పండులాగైంది. నరాలు నిస్తేజమై పోతున్నై. ధైర్యం చెప్పాపెట్టకుండా పారి పోయింది.

"అయ్ బాబోయ్! దెయ్యం...." గావుకేక పెట్టి వెల్లకిలా పడిపోయాడు. ఆశల సంచి శవమ్మీద పడింది. నగలు చెల్లా చెదరైపోయినై.

గావుకేక కాదది... చావుకేక.